# అనంత సత్యం

పుట్టి, పెరిగి విద్యా బుద్ధులు నేర్చిన ఊళ్ళోనే ఉద్యోగం రావడంతో ఎవరెస్ట్ శిఖరమెక్కిన టెన్సింగ్ నార్కేలా సంతోషించాడు అరుణ్. మిత్రుల ముందు సగర్వంగా లేచింది అతని తల.

జాయినింగ్ రిపోర్టు రాసిచ్చి సీట్లో కూచోగానే- కొన్నేళ్ళు యుద్ధంచేసి సింహాసనం గెలుచుకున్న రాకుమారుడిలా ఫీలయ్యాడు. ఆనందం అడుగుల్లో ఉత్సాహం ఉరకల్లో నాలుగు సంవత్సరాలు నాలుగు రోజుల్లా దొర్లి పోయాయనే సత్యాన్ని ఆలస్యంగా గుర్తించాడు. ఆ ఉరకల్లోనే అమల అతనివెంట ఏడడుగులు నడిచి మూడు ముళ్ళు వేయించుకుంది. తన అంద చందాలతో ఒంపు సొంపులతో కాలం తెలీకుండా చేసింది. ఆరు నెలలు గడవకముందే తనకు మూడో నెలంది. స్నేహితులతణ్ని ఆకాశానికెత్తేశారు. సీమంతం సంబరాలైన మర్నాడు వచ్చిన ఆర్డరు కాయితాన్ని చదవగానే కాళ్ళ కింది భూమి కదిలిపోయింది. ఒళ్ళంతా చెమట పట్టేసింది. గుండెనెవరో పిండేస్తున్నట్లనిపించింది.

"కంగ్రాట్స్ అరుణ్!"సీనియర్ కమలాకర్ గేలి చేస్తున్నట్టనిపించింది.

"ఎందుకో....?" కుతకుతలాడింది అంతరంగం.

"మీరు బదిలీమీద వెళ్తున్న ఊరు ఈ ఊరికంటే చిన్నదేం కాదు. అక్కడగూడా అన్ని వసతులున్నాయి. ఈ ఊళ్ళో మీ టెన్యూరైంది. బదిలీ తప్పదు. అదేదో ఎన్నుకోదగిన ఊరికైంది. అదృష్టమే కదా!"

కమలాకర్ మాటలు చెవిని తాకలేదు. ఈ లోకం లోంచి మరో లోకం లోకి లాక్కెళ్తున్నట్లనిపించింది.

ఆ....వంద కిలోమీటర్ల అవతల ఊళ్లో నాకెవరున్నారు?

అక్కడ అద్దె గది దొరుకుతుందో లేదో....దొరక్కపోతే ఏం చెయ్యాలి? దొరికినా ఎలాంటిది దొరుకుతుందో! ఏదన్నా ఆపదవస్తే ఆదుకునే వారెవరూ? ఇక్కడ అమలకు వదినా, చెల్లీ, తమ్ముడు తోడున్నారు. అక్కడెవరుంటారు? అమ్మా నాన్నలు వెంట రారుగదా!

నే నాఫీసు కెళ్లిం తర్వాత ఒంటరిగా గోళ్ళు గిల్లుకుంటూ ఎలా గడుపుతుందో? ఒంటరితనాన్ని భరించలేక గుండెలు పగిలేలా ఏడవదూ?

అల్లిబిల్లి ఆలోచనలు మెదడు పొరల్ని తొలుస్తూంటే ఆఫీసరు నుంచి పిలుపొచ్చింది. రిలీవింగ్ ఆర్డర్ అందుకుంటుంటే గుండె బేజారైంది. ఎప్పుడు ఎలా ఉబికొచ్చాయో కన్నీటి చుక్కలు, ఎవరికీ కనబడొద్దని ఎంత జాగ్రత్త పడినా లాభం లేకపోయింది.

"అలాగైపోతావేమిటోయ్ - మొదటిసారి అత్తారింటి కెళ్తున్న ఆడపిల్లలా! ఉద్యోగం పురుష లక్షణమైతే బదిలీ అనేది ఉద్యోగ లక్షణం. మేమంతా ఏదేదో ఊళ్ళనుంచి వచ్చి ఇక్కడ గడపటం లేదా? బదిలీ మీద మరో ఊరికెళ్ళడం తప్పదుకదా! ఉద్యోగాన్ని సవాలుగా తీసుకోవాలోయ్" ఆఫీసరు అనునయ వాక్యాలు భయాందోళనల్ని తాత్కాలికంగా అణచుకున్నా మనసులో పీకుతూనే వుంది.

బదిలీవార్త ఇంటిల్లిపాదినీ విచారంలో ముంచెత్తింది. నాన్న మాత్రం ధైర్యం చెప్పి సామాన్లు సర్ది బస్సెక్కించాడు వెంట ఉండి.

సూట్‌కేసుతో కొత్త ఊరిలో రిక్షా ఎక్కుతుంటే గుండె లబ్‌డబ్ మంది.

ఆఫీసులో అడుగు పెడుతూంటే చెప్పా పెట్టకుండా పరుగెత్తు కొచ్చిన నిస్సత్తువ శరీరాన్ని నిర్దాక్షిణ్యంగా వాటేసుకుంది.

కాస్త జాగ్రత్త సుమా! మందలించింది మనసు. ఆఫీసరెలాంటివాడో? స్టాఫ్ సహకార మెలాగుంటుందో.

ఆఫీసర్ గదికెళ్ళి "నమస్కారమండీ..." అనగలిగినందుకు తనను తానే అభినందించుకోవా లన్పించింది.

"ఎవరండీ మీరు?" కంచులా మోగింది ఆఫీసర్ కంఠం.

గొంతులో ఏదో అడ్డుపడింది.

"మీరెవరంటే చెప్పరేం? సరాసరి నాదాకా వచ్చారెందుకూ?"

సన్నగా వణుకుతున్న చేతులతో ఆర్డరు కాయితాన్ని ముందుంచి చేతులు కట్టుకు నిల్చున్నాడు - మేస్టారు ముందు కుర్రాడిలా.

"అరె! మీరా....అరుణ్‌గారా!"

"ఔనండీ!"

"మరైతే అలాగున్నారేం? రండి కూర్చోండి! ప్రయాణ బడలికా?" ఆఫీసర్ మొహంలోని రంగులు అర నిమిషంలో మారిపోయినై. కంఠంలో కరకుదనం మాయమై, మార్దవం చోటు చేసుకుంది. అరుణ్ గుండె దడ కాసింత తగ్గు ముఖం పట్టింది. జాయినింగ్ రిపోర్టవగానే స్టాఫ్ మెంబర్ల పరిచయమైంది. ఆప్యాయంగా కరచాలనం చేశారంతా.

అంతా కొత్త మనుషులు. ఎవరితో ఎలా మెసులుకోవాలో, ఏమో - ఆత్మ ఘోషించింది.

సాయంత్రం ఎక్కడుండాలో? లాడ్జింగ్‌లో ఉంటే బోలెడు ఖర్చు. ఆలోచన బుర్రను తొలిచేస్తోంది - బోరింగ్ మేషిన్‌లా.

ఐదింటికి అటెండరు చెప్పాడు - ఆఫీసర్ రమ్మంటున్నాడని. వెళ్ళక తప్పలేదు.

"ఈ ఊళ్ళో మీ బంధువులెవరైనా ఉన్నారా?"

"ఉంటే ఎందుకింత బాధపడతాను?" అనబోయి "లేరు సార్" అన్నాడు.

"గది దొరికే దాకా ఎక్కడుందా మనుకుంటున్నారు?"

"......."

"రెండు రోజులు ఆఫీసులో వుండేందుకు పర్మిషనిస్తున్నాను. ఈలోగా గది వెతుక్కోండి!"

వరదల్లో కొట్టుకుపోతున్న వాడికి చెట్టుకొమ్మ ఆసరా దొరికినట్టయింది.

సాయంత్రం అటెండర్ను హోటలుకు తీసుకెళ్ళి కాఫీ టిఫిన్లు సమర్పించి, టౌనంతా సర్వే చేశాడు వాడి సహాయంతో. కాళ్ళు నొప్పులు పుట్టాయే గాని గది దొరకలేదు. రెండో రోజు అదే పరిస్థితి.

ఇన్నాళ్ళు సొంతింట్లో కడుపులో చల్ల కదలకుండా ఆకు చాటు పిందెలా అమ్మా నాన్నల నీడలో ఉన్నాడు. గూడు కోసం ఇంతగా తిరగాల్సొస్తుందనుకోలేదు. నిరాశా నిస్పృహలు ఆవహిస్తుంటే ఏడుపొచ్చినంత పనైంది. ఉద్యోగమొదిలేసి ఊరెళ్ళిపోదామన్న ఆవేశమొచ్చింది. అలా వెళ్తే నాన్న తిడతాడనే విషయం గుర్తుకొచ్చింది.

మూడో రోజు సహోద్యోగి ముకుందరావు ముందుకొచ్చి "మా పక్క పోర్షన్ నిన్న సాయంత్రం ఖాళీ అయింది. మీక్కావలంటే వచ్చి చూడండి" అని చల్లని కబురందించాడు.

ఆఫీసు సమయం అయ్యాక వెళ్ళాడు ముకుందరావు వెంట. రెండు గదుల పోర్షన్....చిన్నదీ కాదు, మరీ పెద్దదీ కాదు. వసతులన్నీ ఉన్నాయి. అడ్వాన్సిచ్చి సూటుకేసుతో గృహ ప్రవేశం చేయగానే ఎదిగిన ఆడపిల్లకు పెళ్లిచేసి గుండెల మీద బరువు దించుకున్నట్టనిపించింది.

"మీ రీపూట హోటల్ కెళ్ళొద్దు. రండి మా ఇంట్లో భోం చేద్దాం" హోటల్‌కు తయారవుతుంటే ఆపేశాడు ముకుందరావు.

"అబ్బే వద్దండీ! మీకెందుకు శ్రమ?" పుట్టెడంత మొహమాటంలో పిడికెడంత భయం.

"ఇందులో శ్రమేముందండీ?" తన గదికి లాక్కెళ్తూ "అతిథి సత్కారం మన సాంప్రదాయం కదా! ఐనా మీరు మీ భార్యను అంటే మా చెల్లాయిని తీసుకొచ్చింతర్వాత రుణం తీర్చుకుందురు గాని రండి" అన్నాడు.

"నమస్తే మావయ్యా!" ముకుందరావు నాలుగేళ్ళ కొడుకూ, ఆరేళ్ళ కూతురూ స్వాగతం పలికారు కోరస్‌గా.

భయం సగం మాయమైంది.

"వదినగారి నెప్పుడు తీసుకొస్తారన్నయ్యా?" ముకుందరావు భార్య నిర్మల అడిగింది- అన్నం వడ్డిస్తూ. తలెత్తగానే అరుణ్ చూపులావిడ ముఖం మీద వాలాయి. ఆవిడ ఒంటి రాయి ముక్కు పుడకలో చెల్లి రూపం తళుక్కుమంది. మొహం నిర్మలంగా కడిగిన ముత్యం లాగుంది. పవిత్ర భావం మనసంతా నిండిపోయింది.

"మీరేం మొహమాట పడొద్దన్నయ్యా!" నెయ్యి వడ్డిస్తూ అంది "ఇది మీ ఇల్లే అనుకోండి."

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. కృతజ్ఞతా భారం కృంగ దీస్తోంది. నిశ్శబ్ధాన్ని భరించడం కష్టమైపోయింది.

"మాట్లాడు మావయ్యా!" ముకుందరావు పుత్రికా రత్నం అభ్యర్థనతో మొహమాటం పత్తాలేకుండా పారిపోయింది.

" శనివారం వెళ్ళి ఆదివారం తీసుకొస్తానమ్మా! " అరుణ్ మాట హుషారుగా వచ్చింది.

మర్నాడు పక్కింటి రామారావుతో పరిచయమైంది. ఆయన బ్యాంకు ఉద్యోగి. తల్లీ, భార్యా, పిల్లలతో ఉంటున్నాడు. కొన్ని గంటల్లో పాత స్నేహితుడిలా మాట్లాడి భోజనాని కాహ్వానించాడు.

అతని భార్య శ్రీదేవి కలుపుగోలు తనానికి ఆశ్చర్యం కలిగింది. మనస్సు పొంగింది. ఆవిడ మాట్లాడుతుంటే వదిన గుర్తుకొచ్చింది. కొసరి వడ్డిస్తుంటే కన్నతల్లి ప్రత్యక్షమైంది.

"కోడల్నెప్పుడు తీసుకొస్తావు నాయనా?" రామారావు తల్లి సరస్వతమ్మ అడిగింది – మజ్జిగ వడ్డిస్తూ.

"శనివార మెళ్లి ఆదివారం తీసుకొస్తానమ్మా!" అన్నాడు. వారి ఆప్యాయతకు గుండె తియ్యబడింది. పిల్లలతో ఆడుకుంటూంటే కొన్ని నెలలు కంటికి రెప్పలా కాపాడిన పంట కోసి ఇంటికి చేర్చుకున్న రైతులా తృప్తిపడ్డాడు.

కొన్ని రోజులనుంచి తనంటే భయపడి పారిపోయిన నిద్రాదేవి ఒడిలో చేర్చుకొని జోల పాడింది.

ఆదివారం అమలతో రాగానే ముకుందరావు, రామారావు కుటుంబ సభ్యులు గదికొచ్చి సాదరంగా ఆహ్వానించారు.

పరిచయాలైన తర్వాత "రామ్మా కోడలా, ఇల్లెలా ఉందో చూసుకో!" అంది సరస్వతమ్మ అమల నుదురు ముద్దాడి.

"మా మరిదిగారి ఎన్నికెలాగుందో చెప్పు చెల్లెమ్మా! " అమల చేయి పట్టి లోపలికి తీసుకెళ్లింది శ్రీదేవి.

"నువ్వలా కూచో వదినా, సామాన్లన్నీ మేము సర్దేస్తాం. నువ్వట్టి మనిషివి గూడా కాదుగదా!" అంది నిర్మల వంటిల్లంతా చూపించి.

అమల బుగ్గలు విరబూసిన మందారాలైనాయి.

అమల వచ్చింతర్వాత వీధిలోని వారందరి పరిచయాలైనాయి – ఆటో మేటిగ్గా. కొత్తదనం మచ్చుకైనా లేకుండా పోయింది – కొద్ది రోజుల్లో.

కుటుంబాలతో సాన్నిహిత్యమేర్పడింది - నెల రోజుల్లో.

ఆఫీసు స్టాపుతోనే కాకుండా మరి కొందరితో స్నేహం కుదిరింది. రోజంతా హుషారుగా గడుస్తోంది.

కొత్త ఊరు వచ్చేందుకు ముందు వెనకాముందాడిన అమల కా ఊరి వాతావరణం చాలా నచ్చింది. సరస్వతమ్మతో కలిసి దేవాలయం వెళ్తొస్తుంటే ఆమెలో అత్తయ్య దర్శన మిచ్చింది.

నిర్మలలో వదిన, శ్రీదేవిలో అక్కయ్య రూపాలు కన్పించాయి. మాటలతో కాలక్షేపం చేస్తుంటే మరేదో లోకంలో తిరుగుతున్నట్టనిపించింది.

కాలం కాన్వాసు మీద రోజులు, నెలలు దొర్లిపోతున్నాయి గతం గుర్తుకు రాకుండా.

* * *

అరుణ్ ఆఫీసుకు తయారై బ్రీఫ్‌కేసు అందుకుంటున్నాడు.

"తొందలగా లా నాన్నా!" మూడున్న రేళ్ళ మువ్వ ముద్దుగా ఆజ్ఞాపించింది.

అమల - అరుణ్‌ల మొహాలు మెరుపు తీగలైనాయి. నాలుగు కళ్లూ కలిసి కాస్సేపు నవ్వుకున్నాయి కొంటెగా.

రోజూ ఆఫీసు కెళ్తూ "వెళ్లొస్తా అమలా" అనడం అరుణ్ కలవాటు.

"సాయంత్రం త్వరగా రండీ!" అనడం అమల కలవాటు.

ఇద్దర్నీ మించిన మువ్వ ఈ రోజు ఛాన్సు తానే కొట్టేసింది. అరిందలా నోరు తెరచి తండ్రి నాజ్ఞాపించింది.

కూతురు బుగ్గల్ని మెత్తగా ముద్దాడి శ్రీమతి కనుసన్నల్లోని కవ్వింపుల నందుకుంటూ క్షణ కాలం తన్మయత్వానికి లోనయ్యాడు అరుణ్.

"ఈ రోజు సినిమా కెళ్దామనుకున్నాం..." అమల పెదాల మీద అర్థవంతమైన చిరునవ్వు మెరిసింది.

"గుర్తుంది అమలా!"

నవ్వుల పువ్వుల్ని కళ్ళలో ఏరుకునే ప్రయత్నం చేస్తూ గడప దాటాడు.

అరుణ్ ఆఫీసు కెళ్ళగానే - "ఏం చేస్తున్నా వమలా?" అంటూ ప్రవేశించింది సరస్వతమ్మ రోజులాగే.

మగవాళ్లు డ్యూటీలకు, పిల్లలు బడికి వెళ్ళగానే నిర్మల, శ్రీదేవి, సరస్వతమ్మ, అమల ఒకింట్లో చేరి కబుర్ల కాలక్షేపం చెయ్యడం మామూలై పోయింది, ఒకరింట్లో పనుంటే మరొకరు. సహాయం చెయ్యడం ఒకరి కష్ట

సుఖాల్లో మిగతా వారు పాలు పంచుకోవడం మామూలైపోయింది.

"మా కీ ఊరికి బదిలీ కావడం మా అదృష్టం" అంది అమల ఎన్నో సార్లు మురిసిపోతూ.

* * *

ఆఫీసులో అడుగుపెట్టి సీటుదాకా చేరకముందే ఆఫీసర్నుండి అర్జంటు పిలుపొచ్చింది.

"కంగ్రాట్స్! మీరు చాలా అదృష్టవంతులు అరుణ్!" ఆఫీసర్ మందహాసం అయోమయంలో ముంచెత్తింది.

"ఎందుకు సార్?"

"మీకు మీ ఊరికే బదిలీ వచ్చింది. ఇదిగో ఆర్డర్.

టైపు చేసిన కాగితమ్మీద అరుణ్ చూపులు పరుగెత్తాయి. ఫాల భాగం స్వేద బిందువులతో నిండిపోయింది.

"ఎందు కలా డీలా పడిపోతున్నారు?"

"ఏంలేదార్! అప్పుడే నాలుగేళ్లు నడిచాయంటే నమ్మ బుద్ధి కావడం లేదు. ఈ ఊరికి రాగానే ఇక్కడి వాతావరణం అర్థం గాక విసుగెత్తింది. సాధ్యమైనంత తొందరగా తిరిగి మా ఊరెళ్లాలని ఆరాటపడ్డాను. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్కై అర్జీ పెట్టాను, అదిప్పుడొచ్చింది." అరుణ్ గొంతు జీరబోవడం ఆఫీసరుకు ఆశ్చర్యం కలిగించింది. "నయమే గదా! మీ కీ ఊళ్లో టెన్యూరైంది. ఏదో ఒక ఊరికి బదిలీ అవాల్సిందే. అదేదో మీ ఊరికే వచ్చిందని హర్షించాలి గాని, అలా గాలి తీసిన సైకిల్ ట్యూబ్‌లా గయారేంటి?"

ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాలేదు. "అదంతే సార్ ఈ ఊరితో ఏర్పడిన అనుబంధ మలాంటిది" అన్నాడు బలాన్నంతా కళ్ళలోకి తెచ్చుకుని.

"అవును అరుణ్! కొత్త ఊరి కెళ్ళగానే ముందు బేజారెత్తుతుంది, వెళ్ళిం తర్వాత మెల్లిగా కుదుట పడుతుంది, వూరితో ఆత్మీయత పెనవేసుకుంటుంది. చుట్టాలను మించిన మిత్రులు దొరుకుతారు. వూర్నుంచి వెళ్లిపోయిం తర్వాత తీపి గురుతులు మిగుల్తాయి. ఎన్ని వూళ్ళు తిరిగితే అంత ఎక్కువ మంది ఆత్మీయులు దొరుకుతారు." ఆఫీసర్ మాటల్లో అనంత సత్యం గోచరించింది.

అదే వూరిలో మరో సంవత్సరం ఉండనిమ్మని అర్జీ రాసిచ్చాడప్పుడే.

"దయచేసి నాకు సిఫారసు చేయండి సార్!"

"చేస్తాను గాని! వచ్చే సంవత్సరం మీ వూరికి కాక మరో వూరికి బదిలీ వస్తే?"

"అలా రావాలనే నా కోర్కె సార్! కొత్త వూళ్లో మరికొందరు మిత్రులు దొరుకుతారు. జీవితంలో ఎక్కువ మంది స్నేహితుల్ని సంపాదించడం లోనే ఉంది తృప్తి. సృష్టిలో స్నేహానికి మించిన తియ్యనిదేముంది?"

ఇతడు నాలుగేళ్ళ క్రితం వచ్చిన అరుణేనాని అనుమానంతో బుర్ర గోక్కున్నాడు ఆఫీసర్-తనకొచ్చిన బదిలీ ఆర్డర్‌ను మరోసారి చదువుకుంటూ.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 25-9-1991)